
# గాలివాలులో...

చిత్రం— టి. వి. ఎస్. మూర్తి (తెనాలి)



## కె. శాంతి

ఆఫీసు పనిమీద హైదరాబాదు బయలుదేరాడు భాస్కర్. కారులో ప్రయాణం చేస్తున్న అతనిని నీరజ జ్ఞాపకాలు చుట్టు ముట్టినాయి. దాదాపు రెండేళ్ళయింది నీరజను చూసి. ఇప్పుడామె హైదరాబాదులో ఉందో, లేదో కూడా తెలీదు. అతని వెడ్డింగ్‌కు ఒకే ఒక్క గ్రీటింగ్ టెలిగ్రామ్ తప్ప ఆ పైన ఆమె నుండి కబురే లేదు! తన జ్ఞాపకాల తెర నుండి పదేపదే ఆమె అడ్రెసును తలుచుకుని నీట్‌గా తెల్లటి కాగితంపై రాసి జేబులో పెట్టుకున్నాడు భాస్కర్.

పరిచయాలు విచిత్రంగా జరుగుతుంటాయి. భాస్కర్‌కు నీరజతో పరిచయం మరపురానిది. రెండేళ్ళ కిందట అతను హైదరాబాదులోనే పనిచేసేవాడు. ఓ రోజు తొందరగా టెలిగ్రామ్ ఇవ్వడానికి పోస్టాఫీసుకి వెళ్ళాడు. మతిమరుపు మూలాన పెన్ను తెచ్చుకోవడం కాస్తా మరిచిపోయాడు. పక్కనే ఉన్న ఒక అమ్మాయి అతని తడుముకోవటాలు చూసి, "తీసుకోండి" అంటూ ఇచ్చింది.

"థాంక్యూ" అంటూ కళ్ళప్పగించి చూశాడు భాస్కర్. అతనికి మతిమరుపే కాదు; పూర్వ జన్మ పరిచయాల్ని భావన పట్టే అలవాటుకూడా ఉంది. అందుకే ఎవరిని చూసినా వాళ్ళను మునుపే ఎక్కడో చూసినట్లనిపిస్తుంది. అందుకే అన్నాడు— "చూడండి, మిస్! ఇంతకు మునుపు నన్నెక్కడయినా చూశారా?"

"భలేవారే! ఎన్‌ట్రెన్స్‌లో కారును పార్క్ చేస్తూ పక్కనే వెళుతున్న నన్ను చూశారు కాబోలు." గుంభనంగా నవ్వుతూ అంది ఆ అమ్మాయి. ఫక్కున నవ్వాడు భాస్కర్. ఇంతలోకి టెలిగ్రామ్ సంగతి గుర్తువచ్చి పరుగున లోపలికి వెళ్ళాడు. అంతే.

వారం రోజులయ్యాక భాస్కర్ ఫ్రెండు రాజారావు ఇలా అడిగాడు— "ఒరేయ్ భాస్కర్! నీకు గర్ల్ ఫ్రెండ్స్ ఎప్పటినించిరా?"

"నాకా?" ఆశ్చర్య పోయాడు.

"నీరజంటే ఎవరు మరి? కంపెనీ పేరా?" టేబిల్ మీద ఉన్న పెన్ను అతని చేతుల్లో పెడుతూ అన్నాడు.

భాస్కర్ కేమీ అర్థం కాలేదు. నల్లటి ఆ పెన్నును ఇటూ అటూ తిప్పి తెల్లటి అక్షరాలతో దాని పైన 'నీరజ' అని ఉండటం చూసి "మై గాడ్" అన్నాడు భాస్కర్. రాజారావుకు అతని వాలకం నచ్చలేదు. "ఏమిట్రా?" అని అడిగాడు. మెల్లిగా తను చేసిన ఘన కార్యం వివరించాడు భాస్కర్. టెలిగ్రామ్ ఇచ్చాక పెన్ను జేబులో పెట్టుకుని వచ్చేయడమేగాక, అది తనదేనా అన్న సందేహం లేని అతన్ని చూసి కొంటెగా నవ్వాడు రాజా. "ఫర్లేదు. పోస్టాఫీసులో ఇలాటివి మామూలే. ఎటొచ్చి ఆ అమ్మాయి మళ్ళీ కనబడితే ఫ్రెండ్‌షిప్ చేసుకోరా, వెధవా?" అని సలహా పారేశాడు. భాస్కర్ ఈ సారి మరిచిపోకుండా పెన్ను జేబులో పెట్టుకుని ఆ నీరజ కోసం వెతికాడు. ఆ అందమైన అమ్మాయి సుందరమైన నవ్వును, తనను ఎగతాళి చేస్తూ అన్న మాటల్ని పదేపదే గుర్తు చేసుకున్నాడు. ఆఫీసు నుండి క్వార్టర్స్‌కు వెళ్ళే దారిలోను, సినిమా హాల్లోనూ, బజార్లో, బీచిలో— ఎక్కడైనా నీరజ లాంటి అమ్మాయి కనిపిస్తే పరిశీలనగా చూసేవాడు. నెల రోజులు వెదికి, ఆ పెన్ను కాస్తా పారేస్తానేమోనని బీరువాలో దాచేసుకున్నాడు భాస్కర్. కాని, నీరజ కనిపిస్తుందేమో నని చూడడం మానలేదు.

ఒక రోజు ఆఫీసులో పనిలేక రాజారావు డిస్పెన్సరీకి వెళ్ళాడు. అక్కడ పేషంట్లతో రాజా బిజీ పడడంతో మేగజైన్స్ తిరగేస్తూ గమనిస్తున్నాడు. రాజా అంటున్నాడు—"చూడండీ! మీ ఆవిడకు పుష్టికరంగా ఆహారం ఇవ్వాలి — చాలా బలహీనంగా ఉంది. రోజుకు మూడు పూటలా హార్లిక్సూ, రెండు పూటలా ఎగ్..."

భాస్కర్‌కు గట్టిగా నవ్వొచ్చింది. రాజారావుకు హార్లిక్సంటే అసహ్యం. కాని, డాక్టరుగా చెప్పక తప్పదు. వచ్చిన వాళ్ళను పరిశీలనగా చూశాడు. ఇద్దరూ అమ్మాయిలే. కవల పిల్లల్లాగా ఉన్నారు. ఒకావిడ చిక్కిపోయి ఉంది. ఆవిడకే ప్రిస్క్రిప్షన్ రాసిస్తున్నాడు రాజా. ఇంకో ఆవిడ అలాగే ఉంది. కానీ, మొహంలో చురుకుదనంతో ఆకర్షణ ఎక్కువగా ఉంది. ఆమెకూడా ఇటు తిరిగి తనను చూస్తున్న భాస్కర్ కేసి చూసింది. వెంటనే తల తిప్పుకున్నా ఆమె ఎందుకో సన్నగా నవ్వినట్లనిపించింది అతనికి. ఆ నవ్వును ఎక్కడో చూసినట్లనిపించింది. ఇంతలో పేషంట్ అవతలికి వెళ్ళింది.

"అక్కను మళ్ళీ ఎప్పుడు తీసుకు రమ్మంటారు, డాక్టర్?" అందామె.

"నెక్స్ట్ వీక్‌లో రండి. కండిషన్ చాలా వీక్‌గా ఉంది. దాటిపోతే ఏం చెయ్యలేం. జాగ్రత్తగా చూసుకోండి, నీరజగారూ!"

ఆవిడ వెళ్ళిపోయింది.

షాక్ తిన్నట్లయ్యాడు భాస్కర్. 'నీ...ర...జ... పోస్టాఫీస్‌లో అమ్మాయి. ఆ నవ్వు ఈ నవ్వే.' తన మతిమరుపు ఇంత హెచ్చు స్థాయిలో ఉందని అతనికి తోచలేదు. ఆమె తనను గుర్తు పట్టిందనే దానికి నవ్వడమే సాక్ష్యం. "ఇప్పుడే వస్తా, రాజా!" అంటూ పరుగెత్తాడు. ముసలి పేషంటుతో మాట్లాడుతున్న రాజారావు అతని వంక ఓర కంట చూసి చూపు మరల్చుకున్నాడు.

రిక్షాలో పేషంటును కూర్చో పెడుతున్న నీరజ దగ్గరికి పరాపరి వచ్చి ఆగిపోయాడు భాస్కర్. ఏమి టన్నట్లు చూసిం దామె.

"నే నెవర్నో గుర్తున్నానా మీకు?" జేబు తడుముకున్నాడు లేని పెన్ను కోసం.

"గుర్తున్నారో, లేదో నే నిందాకా నవ్వినప్పుడే తెలుసుకొనుంటారు" అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఎవరే, నీరూ!" అంది రిక్షాలో ఆవిడ నీరసంగా.

ఏం చెప్పమన్నా రన్నట్లు చూసింది నీరజ భాస్కర్ కేసి.

"నా పేరు భాస్కర్. వి. ఎస్. కంపెనీ బ్రాంచికి మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాను" అన్నాడు, ఆవిడకు నమస్కరిస్తూ. హాస్పిటల్ ముందు బాగుండదని— "నీరజగారూ! రేపు మిమ్మల్ని కలుసుకుంటాను— ఎక్కడి కొస్తానో చెప్పండి" అన్నాడు.

"పోస్టాఫీస్ దగ్గర!" ఏ మాత్రం తడుముకోకుండా అంది.

అతనికి కాస్త కోపం వచ్చింది. అయినా, "రైట్. ఫైవ్‌కి కరెక్ట్‌గా వస్తాను. ఉంటారుగా" అన్నారు.

'నమ్ముకోండి' అన్న ట్లతని కేసి తలూపి నీరజ రిక్షా ఎక్కింది.

భాస్కర్‌కు ప్రశాంతమైన ఆ క్షణంలో అందంగా అగుపించ సాగింది. ఆ అమ్మాయితో, వాళ్ళ అక్కతో అంత ఫ్రీగా మాట్లాడింది తనేనా అను కుంటూ లోపలికి నడిచాడు. పేషంట్లెవరూ లేరు. "ఏమిట్రా కథ? కొంప దీసి నీ ఫ్రెండు నీరజ, ఈ నీరజ ఒకటేనా ఏంటి?" అన్నాడు రాజా.

"ముందు—నువ్వు ఇందాకా వచ్చిన నీరజ కథ చెప్పవోయ్?" డిమాండ్ చేశాడు భాస్కర్.

"పేషంట్ల గురించి కథలు, కావ్యాలు చెప్పడం నా పని అనుకున్నావా? అయినా, అడుగుతున్నావు గనక మూడు మాటలు: ఒకటి—నీరజ ఒక కాన్వెంటు స్కూల్లో టీచర్‌గా పని చేస్తోంది. రెండు—వాళ్ళక్కయ్య సరోజ నా పేషంటు. మూడు—నాకు ఫీజు తక్కువగా వచ్చే కేస్."

భాస్కర్‌కు ఒళ్ళు మండింది. "రాజా! ఇదట్రా నువ్వు చేసేది. పేదవాళ్ళ గురించి అన్ని లెక్చర్లు ఇస్తావే?"

"స్టాప్. స్టాప్. నేను ఫీజు రాదన్నానే కానీ, ట్రీట్‌మెంట్ ఇవ్వనన లేదే. మరి నీ కథ ఏమిటి? నీరజ కోసం ప్రేమలో పడితివా, మిత్రమా! మంచిదే. ఆ అమ్మాయి బహు చక్కనిది. ఆ సుగుణ శీలత. . ." అప్పటికే భాస్కర్ విసుగ్గా ఆ రూము నుండి నిష్క్రమించాడు.

* * *

మరునాడు సాయంత్రం నాలుగ్గు మంచి ఎదురు చూసి ఐదుంపావుక్క నీరజను పోస్టాఫీసు దగ్గిర కారులో ఎక్కించుకుని స్వర్గా న్నందుకున్నట్లు ఫీలయ్యాడు భాస్కర్. ఆ నాటి నుండి అలసు మరచిపోవడం అనే విషయాన్ని పూర్తిగా మరచిపోయ్యాడు. నీరజ అతన్ని అయస్కాంతం లా ఆకర్షించింది. వాళ్ళిద్దరూ పార్కులో కూర్చున్నారు. భాస్కర్ తన పాకెట్‌లో మంచి పెన్ను తీసి ఇచ్చాడు. నీరజ మౌనంగా నవ్వింది. ఆమె ఏమీ అనకపోవడం చూసి, "మీ రేమీ అనుకోనంటే ఆ పెన్ను నా కివ్వండి. మీ జ్ఞాపకంగా ఉంచు కుంటాము" అన్నాడు. నీరజ అతనికి పెన్నందించి, "మీరు విచిత్రమైన మనిషిగా ఉన్నారు. నే వదగందే! ఉంచు కోండి" అంది. ఆ తరవాత ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"నీరజా! మీతో పరిచయం పెంచు కోవాలని నా కెంతో కోరికగా ఉంది."

"నాకూ లేకుండా పోలేదు. . ." ఆగిపోయింది.

"మరి? మీ గురించి మా రాజా... అదే మీ డాక్టరు కొద్దిగా చెప్పాడు. నా కింకా తెలుసుకోవాల నుంది" అన్నాడు చెట్టుకు జారగిలబడి.

"ఆహా! ఇన్ని రోజులకు నా గురించి తెలుసుకో వాలనుకునేవా రగుపించారు. చెబుతాను. మా అమ్మ చిన్నప్పుడే పోయింది. మా ఫాదర్ మొన్న మొన్ననే ఈ లోకాన్ని, మమ్మల్ని వదిలి వెళ్ళారు. మా పెదక్క—చిన్నచూపాయలుగా ఎమ్.ఎ. చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగానే దాని ఆరోగ్యం బాగా పాడయింది. అందుకు నేను బి. ఎ. తో ఆపేసి టీచరుగా పని చెయ్యవలసి వచ్చింది. మా తమ్ముడిని బాగా చదివిస్తు నను కోండి. ఇవాళే మీతో స్నేహమంటారా? నేను మనుష్యుల్ని అంత తొందరగా మరిచిపోను. పోస్టాఫీస్ లో పెన్ తీసుకున్న మనిషి ఎంతకు రాకపోయే సరికి ఒళ్ళు మండింది. వెధవది. . . రెండు రూపాయలు అనుకోండి. కాని, పేద వాళ్ళకు—అందులో స్కూల్ టీచర్లకి జీతం నెలాఖరునకూడా రాదు. మాటిగా చెప్పన్నందుకు బాధ పడకండి. వేరే పెన్ను కొనేశాను. కాని, ఇలా మీతో పరిచయం కలగడం నాది అదృష్టంగానూ, మీది దురదృష్టంగానూ కనిపిస్తోంది నాకు." భాస్కర్ రోషంగా ఆమె వైపు చూశాడు. తిరిగి నీరజే అంది: "మీతో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం నాకూ ఇష్టమే కానీ, నా పరిస్థితులు వేరు. మీ జీవితం వేరు. . ." కఠినంగా ఉన్న భాస్కర్ మొహం చూసి ఆగి పోయింది.

"నిర్మలమైన మనసుతో స్నేహం కోసం అర్థిస్తే ఇలా తిరస్కరిస్తా రనుకో లేదు. మీరు జీవితంలో కొన్ని సమ యాల్లో అయినా అమ్మా, నాన్నలను పొంద గలిగారు. కాని, నేను చిన్నప్పటి నుంచీ ఏకాకినే. నా కున్న స్నేహితులూ బహు కొద్ది. పరిస్థితులలో ఏమున్నది? కష్ట సుఖాలు పంచుకోవడ మేగా స్నేహం. అయినా, నన్ను క్షమించండి. సరదా కన్నాను. అది మీ కంత బాధాకరమైతే వద్దు. మరింక మనం వెళ్ళిపోదామా?"

"ఐయాం సారీ! మీ మనసును నొప్పించానేమో. మీకు నే నన్నది అర్థం కాలేదు. పోనీ, మీ రన్నట్లు ఈ నాటి నుంచీ మీరు నా స్నేహితులు. మంచి స్నేహితులుగా మనం కలుసు కుందాం." సంధి ప్రయత్నాలు చేస్తు న్నట్లుగా అంది నీరజ. భాస్కర్‌కు నీరజ తత్వం అర్థం అయినా, కానట్లని పించింది.

* * *

పరిచయమైన ఏడాదికి నీరజ భాస్కర్‌కు ప్రాణ స్నేహితురా లయింది. భాస్కర్ ఒంటరి వాడు. ప్రపంచంలో మనుషుల మధ్య ప్రేమాభిమానాలు ఎలా ఉంటాయో అతనికి తెలీదు. అందుకే అతను నీరజను తనకు తెలియకుండానే



ప్రేమించసాగాడు. కనీసం వారం రోజులకు ఒకసారి కలుసుకోవాలని మొదట నిర్ణయించుకున్నాడు. తరవాత మూడు రోజులకు, అటు తరవాత రోజు కో సారన్నా నీరజను చూడకుండా భాస్కర్ ఉండలేక పోయాడు. పైకి ఇష్టం లేనట్లు నటించినా, నీరజ రెండు రోజులు భాస్కర్ కనిపించకపోతే ఆందోళనతో వాళ్ళ ఆఫీసుకు ఫోన్ చేసేది. ఎంత కాదనుకున్నా, ఇద్దరూ ఒకరి కొకరు చేరువయ్యారు.

ఒక రోజు నీరజ బస్ స్టాప్‌లో నిలబడి ఉంటే తన కారులో ఎక్కించు కున్నాడు బలవంతంగా. తెల్ల చీరలో మల్లెపువ్వులా మెరిసిపోతున్న నీరజను చూస్తూ కారును రెండు సార్లు ఏక్సిడెంట్‌కు గురి చెయ్యబోయాడు.

"భాస్కర్!"

"ఊఁ."

"చెప్తున్నాను—ఇదే ఆఖరు. ఇంకో సారెప్పుడూ కారులో లిఫ్టు ఇస్తే నన సూడదు. అలాగయితే నీతో మాటలు బంద్."

"ఇలా చాలా సార్లన్నావు"

"కాని, ఇది ఆఖరు సారి." బెదిరిస్తూ అంది.

"నిజంగా. . . అలా గయితే నాతో మాట్లాడకుండా ఎలా గుంటావో చూడా లనుంది. కానీ మరి. . ." అన్నాడు కొంటెగా.

తల పట్టుకుంది నీరజ. "నా మాట విను, భాస్కర్ బాబూ! స్నేహం అంటూ నన్ను నవ్వుల పాలు చెయ్యొద్దు—ఏదైనా పరిధిలోనే బాగుంటుంది."

"ఆర్ యూ సీరియస్?" అన్నాడు.

"కాక?! నువ్వొక ఆడ స్కూల్ టీచర్‌వై ఉండి ఇట్లా అందరి మధ్యా లిఫ్టందుకోవలసి ఉంటే నీకు తెలిసేది."

"అలిసిపోయావు. ఇల్లొచ్చింది. దిగవోయ్."

భాస్కర్ కేసి కోపంగా చూసి, డోర్ విసురుగా వేసి ఇంట్లోకి వెళ్ళింది నీరజ.

• • •

తరవాత వరసగా వారం రోజులు దాకపోయేసరికి కోపం కరిగిపోయి, భాస్కర్‌కు ఫోన్ చేసింది. అతనికి జ్వరమనీ, హాస్పిటల్లో ఉన్నాడనీ తెలిసి తల్లడిల్లి పోయింది నీరజ. స్కూలుకు లీవు పెట్టి హాస్పిటల్లోనే ఆ రోజంతా గడిపింది. అల్లరి చేస్తూ నవ్వించే మనిషి బెడ్‌పై కుదురుగా పడుకోవడం చూసి ఏడ్చేసింది నీరజ.

"భాస్కర్! స్నేహం గురించి ను వ్వేమన్నావు? కష్ట సుఖాలు పంచుకోవా లన్నావుగా. మరి మూడు రోజులు జ్వరంతో నాకు మాట మాత్రంగా నైనా ఎందుకు చెప్పలేదు? నేనేమీ కానవేగా?"

"కాదు, నీరూ! అలా అనుకోకు. నువ్వు నాతో మాట్లాడ వన్నావుగా?!"

"మాట్లాడనన్నాను కానీ, జ్వరమొస్తే చూడ వద్దనలేదే. ను వ్వెంత పెద్ద వాడివి? అసలు నీతో మాట్లాడడం నిజంగా నా తప్పు." లేవబోయింది నీరజ.

"ఇన్ని రోజు లెలాగూ లేవు. ఇకనైనా నన్ను చూడవూ, నీరూ!" దీనంగా అన్నాడు.

"ను వ్వెంత మొండివాడివి? ఉంటాలే. పడుకో. నేను కబుర్లు చెబుతాను." దుప్పటి సరిగ్గా కప్పుతూ అంది. భాస్కర్ బుద్ధిమంతుడులా కళ్ళు మూసుకున్నాడు.

• • •

"రవీ! నీరజ ఇంట్లోనే ఉందా?" ఇంటి ముందున్న నీరజ తమ్ముణ్ణి అడిగాడు భాస్కర్.

"ఉంది. రండి, రండి" అన్నాడు రవి.

"అక్కా! నువ్వు టాబ్లెట్ వేసుకో కుంటే నిజంగా నేను చచ్చిపోతాను." సరోజతో వాదిస్తున్న నీరజను చూసి ఆగాడు భాస్కర్.

"రండి, భాస్కర్ బాబూ! కనిపించటం లేదే ఈ మధ్య. కూర్చోండి. ఈ మీరూ చూడండి! వద్దే అంటే వినదే. పొద్దస్తమానం తను పని చెయ్యాలట, నేనుతినాలట" అంది సరోజ, తన గుంటలు పడిన కళ్ళలోని నీటిని దాచేస్తూ. నీరజ విసురుగా టాబ్లెట్ మంచం మీద పడేసి లోపలికి వెళ్ళింది. సరోజ మళ్ళీ ఆరంభించింది: "పెళ్ళి కావలసిన పిల్ల. నాలుగు డబ్బులు వెనకేసుకోవడం తెలీదు. నా కీ రోగం నయంకాదు. రవి దేముంది? మగవాడు. ఎలాగయినా బతకగలడు. తన దారి అది చూసుకోరాదూ? తెల్లారి లేచింది మొదలు—'అక్కా! తిను, తిను'— ఇదే మాట." దుఃఖంతో మాట ఆగి పోయింది. లోపలి నుండి ఏడుస్తున్న చప్పుడు వినిపించింది. సరోజ చటుక్కున టాబ్లెట్ నోట్లో వేసుకుని మింగేసింది. "నీరూ! ఇలా రా! వేసుకున్నాను." నీరజ రాలేదు. "నీరూ! నిన్నే, తల్లీ! వేసుకున్నాగా. ఇక రావమ్మా!" సరోజే లేచి నిలబడి తూలి పడింది. భాస్కర్ ఆమెను మంచం మీద కూర్చోబెట్టాడు. "నీరక్కా! అక్క పడిపోయింది." అరిచాడు రవి. నీరజ పరుగెత్తుకు వచ్చి సరోజ ఒళ్ళో వాలిపోయింది. సరోజ ఆమెను ఓదారుస్తూ, "పిచ్చిదానా! నీకు శాంతి లేకుండా చేస్తున్నాను" అంది ఏడుస్తూ.

బాధ మాధవీయం

చిత్రం— దేవు దీక్షితులు (ఒంగోలు)



భాస్కర్‌కు ఏం చెయ్యాలో, చెప్పాలో తోచలేదు. ఆ అక్కా చెల్లెళ్ళ రోదనని వింటూ కూర్చోలేకపోయాడు. "సరోజా! మీరు త్వరగా కోలుకుంటే అందరు కులాసాగా ఉంటాం. మీరు మనసును నిర్మలంగా ఉంచుకోండి. రాజా చెప్పాడు కదా, నయ మయి పోతుందని. శ్రద్ధగా మందులు తీసుకుంటారుగా! ఏదీ...ప్రామిస్ అనండి?"

"ప్రామిస్" అంది సరోజ.

"థాంక్స్. మరి, నీరజా, అక్కయ్య త్వరగా కోలుకుంటుంది. ఏదీ ఒకసారి నవ్వేసెయ్యి, నేను వెళ్ళిపోతాను." నీరజ కనులు తుడుచుకొని కాఫీ కలిపి భాస్కర్‌కు ఇచ్చింది.

• • •

"రాజా! సరోజ కండిషన్ ఎలాఉందం టావు?" నీరజను వెంట బెట్టుకుని రాజారావు డిస్పెన్సరీకి వచ్చాడు భాస్కర్.

"చాలా తీవ్రంగా ఉంది. ఆమెలో టి.బి. పూర్తిగా రాకముందే పోగొట్టాలని నే నెంతో ట్రై చేశాను. కాని, ప్రయోజనం లేకపోయింది." నీరజ ముఖంలో రంగులు మారాయి. దుఃఖం ఆమెలో తోసుకుని వచ్చింది.

"అయితే, అక్కకు తగ్గదంటావా, భాస్కర్?" అంది, కళ్ళను గట్టిగా తుడిచేస్తూ.

"అలాగన్లేదే. తప్పకుండా తగ్గి పోతుంది. కాని, చాలా కాలం పడుతుంది. అదీ బాగా ట్రీట్‌మెంట్ జరిగితేనే". అన్నాడు రాజారావు ఖరారుగా. నీరజ చేతిని తన చేతుల్లోకి తీసుకుని "రాజా! నువ్వా ట్రీట్‌మెంట్ శ్రద్ధగా చెయ్యక తప్పదు...నా కోసం, నీరజ కోసం" అన్నాడు భాస్కర్. "అలాగే! అందుకు నీ రెకమెండేషన్ అవసరం లేదు" అన్నాడు రాజా నవ్వుతూ.

నీరజను తీసుకుని హాస్పిటల్ నుండి వచ్చేశాడు భాస్కర్. ఆమె వైపు చూడా లంటే ఎందుకో అతనికి హఠాత్తుగా భయం వేసింది. ఆమె పట్ల అతనికి ఉండే ప్రేమను, ఆమెకు కలిగిన కష్టానికి సానుభూతిని ఎలా వ్యక్తం చెయ్యాలో, ఎలా చెబితే ఆమె దుఃఖం తగ్గుతుందో అతనికి తెలీలేదు. ఆమె కోప్పడుతుందని సిగరెట్లు కాల్చడం, ఎక్కువగా కారులో వెళ్ళడం మానేశాడు. ఆమె కోసం ఏమైనా చెయ్యగలడు. కాని, ఆ విషయం చెప్పలేక పోతున్నాడు. ఇద్దరూ బీచ్ చివరి దాకా నడిచారు. ఆమె చేతిని గట్టిగా నొక్కి పట్టుకున్నాడు.

"నీరూ! ఇన్ను దేముందని నీ కీ దుఃఖం? నా కోసమైనా సరోజన్ని బాగు చేస్తాడు రాజా. ఆమె కోల్చ

కుంటుంది. నే నుండగా నీ కెందుకు భయం, నీరూ? స్నేహితుణ్ణి, నీ వాణ్ణి... నీ కేం కొదవ?'' నీరజ ఏడుపు ఎక్కువైందే కానీ, తగ్గలేదు. భాస్కర్ నిస్సహాయంగా చూశాడు. ఆమెను దగ్గిరికి తీసుకోబోయాడు. నీరజ ఏడుపు ఆపేసింది. ఎందుకో వెకిలిగా నవ్వింది. కళ్ళు తుడిచేసుకుంది.

''నే ఏడుస్తున్నది అక్క కోసం కాదు; నా కోసం! నా కోసమే. అయినా, నా కేం కొదవ? మీరున్నారు. అక్కయ్యకు నయమయిపోతుంది. అంతేగా!'' గట్టిగా నవ్వేసింది.

''అంతే, నీరూ, అంతే'' అన్నాడు భాస్కర్ చిరునవ్వుతో.

● ● ●

సరోజ పరిస్థితి నానాటికీ దిగజారి పోయింది. ఇంతలో భాస్కర్‌కు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. ఇరవై రోజులు గడువిచ్చారు. అతని కేం చెయ్యాలో తోచలేదు. వెళ్ళిపోవాలి. కాని, నీరజ లేకుండా ఎలా వెళ్ళగలడు? నీరజ లేకుండా ఎలా ఉండగలడు? ఆలోచించి ఆలోచించి ఆమె కిలా లెటర్ రాశాడు:

''నీరూ,

నువ్వంటే నా కెంతో ఇష్టమనీ, నీ స్నేహం కావాలనీ నేనీ లెటర్‌లో రాయబోవటం లేదు. నేను కొద్ది రోజుల్లో గుంటూరుకు వెళ్ళిపోతాను. నాతో బాటూ నిన్నూ తీసుకు వెళ్ళా లన్నదే ఈ లెటర్ ఉద్దేశం. సరోజ ఆరోగ్యం, రవి జీవితం, అన్నిటినీ మించి నీ ప్రేమనీ నేను కాపాడగలను. జవాబు కోసం రేపు మీ ఇంటికి వస్తాను. మన పరిచయానికి ఆఖరి మెట్టుగా నిన్ను నా దానిని కమ్మని కోరుకుంటూ...

—నీ భాస్కర్.''

● ● ●

మరునాడు పొద్దున్నే లేచి నీరజ వాళ్ళింటికి వెళ్ళాలని తలచాడు భాస్కర్. తన లెటర్ ఇచ్చినప్పుడు నీరజ కళ్ళలో కనిపించిన కంగారు గుర్తు వచ్చి అతను నవ్వుకున్నాడు. అతని తొందరకు అర్థం లేకపోలేదు. ఆఫీసుకి వెళ్ళినా, పని చెయ్య లేకపోయాడు. అయిదు గంట లయినా కాకముందే నీరజకోసం సరాసరి వాళ్ళింటికి వెళ్ళాడు. సరోజ నిద్ర పోతూంది. నీరజ అతణ్ణి పెరట్లో జాజి పందిరి కింద కూర్చోబెట్టింది.

''ఇప్పుడే కాఫీ తీసుకుని వస్తాను.''

''ఊఁ హూఁ! నే నంతదాకా ఆగలేను. నాతో వస్తున్నావా, లేదా?''

''చెబుతాను. కాఫీ ఇచ్చాకే అన్నీ!'' లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చేదాకా క్షణ మొక యుగం లాగా అనిపించింది భాస్కర్‌కు. గబుక్కున తాగేసి, ''ఇక చెప్పు'' అన్నాడు. నీరజ జవాబివ్వకపోయేసరికి— ''ఉదయం నుంచీ తహతహ లాడిపోతున్నాను. తొందరగా చెప్పు. నాతో వస్తావుగా?'' అని అడిగాడు. నీరజ తన తలను అడ్డంగా ఊపింది. భాస్కర్ తీవ్రంగా అయిపోయాడు.

''ఏం, దేనికి? నేను నీకు తగనా?''

''కాదు. కాదు.''

''మరింకెందుకు నీరూ! అక్కయ్య వాళ్ళను నేను చూసుకుంటాను. నీ కెందు కింక భయం?'' మాటిగా చూడ లేని నీరజ చెయ్యి వేసి చూస్తూ కంటి లోని నీటిని దాచేసింది. భాస్కర్ నొచ్చుకున్నాడు. ''చెప్పవూ, నీరూ! నువ్వు న న్నెంత ప్రేమిస్తున్నావో నాకు తెలుసు. ఎందుకు కాదంటావు?'' లాలనగా అడిగాడు.

ఏడుస్తూనే అంది నీరజ— ''నన్ను క్షమించండి.''

''కాదు. నీ కిష్టం లేకపోతే నే నేమీ అనను. అనుకోను. నాకు కారణం కావాలి.''

నీరజ కారణం చెప్పలేదు.

''అయితే, ఒప్పుకున్నట్లేగా?''

''భాస్కర్! మనం కలవలేం. నీకు లెటర్ రాశాను'' పుస్తకం లోంచి తీసి ఇచ్చింది ఆత్రతగా. దాన్ని అక్కడే చింపి చదివేశాడు భాస్కర్.

''భాస్కర్,

నీ కిలా జవాబియ్య వలసి వస్తుందని నా కేనాడో తెలుసు. నేను నీతో రాను. రాలేను. మా బావ గోపీ మద్రాస్‌లో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. మేము చిన్నప్పటి నించీ ప్రేమించు కున్నాం. అవకాశం లేక నీ కింత వరకూ చెప్పలేదు. పెళ్ళి అక్కయ్య కోలుకో గానే జరుగుతుంది. కాని, నువ్వంటే నా కెప్పటికీ ఇష్టమే. ఆ ఇష్టానికి నిర్వచనం నేను ఇవ్వలేను. గాయపరిస్తే మన్నించు.

నీరజ.''

భాస్కర్ మొహం నెత్తురు చుక్క లేకుండా పాలిపోయింది. అతని హృదయపు లోతుల్లోకి ముల్లు దిగబడినట్లనిపించింది. అతని కళ్ళల్లో సన్నగా కన్నీటి రేఖ మెరిసింది. నీరజ కేసి చూశాడు. ఆమె మౌనంగా ఏడుస్తూంది. ఆమె తప్పేముంది కనక? అతనికి వెంటనే అక్కడ నుంచి వెళ్ళిపోవా లనిపించింది. ''వస్తాను, నీరూ!'' నీరజ భయంగా అడిగింది— ''భాస్కర్! న న్నింకెప్పుడూ చూడనైనా చూడవూ?'' ''చెప్పలేను, నీరూ! నీమీద నాకు కోపం రావటం లేదు. నా గాలి మేడలు పూర్తిగా శిథిలమయ్యాక నీకు కనిపిస్తాను.''

ఆ నాటి నుంచీ నీరజనే చూడలేదు. ట్రాన్స్‌ఫరై గుంటూరు వచ్చాను. అతని కోపం కోల్పోటానికి ఏండ్లయినా చాలలేదు. కాని, సుధ అతన్ని మళ్ళీ మామూలు మనిషిగా చేసింది. అసలు కిప్పుడు ఒక పాపకూడా. ఇన్ని రోజులైనా, నీరజను భాస్కర్ మరువలేదు. సరోజ ఏమయిందో, నీరజ వాళ్ళ బావను పెళ్ళి చేసుకుందో— లేదో అతనికి తెలీదు. భాస్కర్ తన జ్ఞాపకాల నుంచి గమ్యం చేరాడు.

● ● ●

ఆఫీస్ పని అయ్యాక ఫ్రెష్‌గా స్నానం చేసి మరీ బయులుదేరాడు భాస్కర్. కారును నీరజ వాళ్ళింటి వైపుకు నడిపించాడు. అతనికి పాత సంఘటన లన్నీ గుర్తు రాసాగాయి. ఎన్ని సార్లు ఆ వీధిలో నీరజను డ్రాప్ చేశాడో, ఎన్ని సార్లు ఆ ఇంటిలోకి దేవాలయం లోకి వెళ్ళినట్లు స్లిపర్స్ తీసేసి వెళ్ళేవాడో అతని కళ్ళ ముందు కదలాడాయి. టైము చూసుకున్నాడు. అది స్కూల్ టైమ్ దాటింది. 'కొంపదీసి వీళ్ళీ ఇల్లు వదిలెయ్యలేదు కదా' అనుకుంటూ తలుపు తట్టాడు. ''నీరజేమో అనుకున్నాను, భాస్కర్! ఎదురుగా సరోజ!

''మీరా!'' అంది ఆశ్చర్యంగా.

''నేనే. మీ కింకా గుర్తున్నానా?''

''మిమ్మల్నెలా మరిచి పోతాం. రండి లోపలికి ట్రాన్స్‌ఫరై గుంటూరులో ఉన్నారని నీరజ చెప్పింది. వెళ్ళేటప్పుడు ఒక మాటైనా చెప్పకుండా వెళ్ళేరే. కనిపించ ఒక్క లెటరయినా రాయలేక పోయారా? మేమేం ద్రోహం చేశామని?'' భాస్కర్‌ను కూర్చోబెట్టి, తనూ కూర్చుంది సరోజ.

పల్లెసీమ చిత్రం— టి. వి. ఎస్. మూర్తి (తెనాలి)



విప్పారేటట్టు చూశాడు భాస్కర్. "నీరజ లేదా?" ఆత్రంగా అడిగాడు.

"ఇంకా రాలేదు. కాలేజీలో మీటింగ్ ఉందేమో. మీకు తెలీదుగా— నీరజ ఫస్ట్ క్లాస్‌గా ఎమ్. ఎ. చేసింది. లెక్చరర్‌గా పని చేస్తోంది." నిట్టూరుస్తూ అంది. పరిశీలనగా, పరధ్యానంగా ఆ ఇంటి పరిసరాలని గమనిస్తూ కూర్చున్నాడు.

"అన్నట్టు మీ ఆరోగ్యం ఎలా ఉంది? రవి ఫారిన్ వెళ్ళాక, నాకు మీ విషయంలో చాలా ఇదైంది." పరిశీలనగా చూస్తూ అన్నాడు.

"నేను బతికున్నాను చూశాక ఇక ఇబ్బంది ఏముంది? శారీరకంగా తగ్గినా, మనసు పుండేదోగా కోలుకుంటుందా?" నవ్వు స్వాగా ఉంది. భాస్కర్ నీరజ ఎప్పుడొస్తుందా? అని ఆలోచిస్తున్నాడు.

"మీ పెళ్ళికి వెళ్ళమని నీరజా నన్ను బలవంతం చేసింది. రోగిష్ఠి దాన్ని ఎలా రాను? పిల్లలా. . .?"

"ఒక పాప"

"ఏం పేరు పెట్టారేమిటి? నాకు పాపలంటే చాలా ఇష్టం." ఉత్సాహంగా అంది సరోజ.

తటపటాయించాడు భాస్కర్. "ఇంకా పెట్టలేదా?"

"పెట్టాం. నీరజ!"

సరోజ అతని కేసి వింతగా చూస్తూ కూర్చుంది. "మీ రేమీ అనుకోరంటే ఒకటడగనా?"

"అడగండి."

"ఏమీ అనుకోకపోతే. మీ రెందుకలా హఠాత్తుగా మా ఇంటికి రావడం మానేశారు? నీరజ నెన్ని పోట్లాడినా, మీకు ట్రాన్స్‌ఫర్ వెళ్ళారంది. మనసు ఎందుకు చెప్పలేదంటే తనకు తెలీదంది. మీరు వెళ్ళాక దాని మొహంలో కళ లేదు. నాకు కాదు టి. బి. దానికి వచ్చిందానిలాగా ఉండేది. మీ దగ్గర్నించి ఉత్తరమైనా రాయలేదు. మీ పెళ్ళిబడు కార్డు వచ్చాక దానికి రెండు వారాలు ఫీవర్. బతుకుతుందా అనిపించింది. మీ రిద్దరూ ప్రేమించుకున్నారనీ, పెళ్ళి చేసుకోబోతారని నే నొకప్పుడు అనుకునేదాన్ని. అందుకే మీతో చనువుగా ఉండేదాన్ని. నీరజను ఉండనివ్వాను. ఇప్పుడు చెప్పండి. మీ రెందు కలా చేశారో?" కన్నీళ్ళు తుడుచుకుంది సరోజ.

భాస్కర్ తల దించుకున్నాడు. "చెప్పండి." రెట్టించింది సరోజ.

"ఏం చెప్పమన్నారు? అనుకున్న వన్నీ జరగవు."

"అదలా ఉండనీండి. మీ మధ్య ఏం జరిగిందో చెప్పండి."



తీయని తలపోత

చిత్రం— కె. నాగేశ్వరరావు (మద్రాసు)

భాస్కర్ మెల్లిగా అన్నాడు "మీ బావగారు ఇప్పు డెక్కడున్నారు?"

"మా బావగారా?" ఆశ్చర్యంగా నోరు తెరిచింది సరోజ.

"ఎక్కడో ఇంజనీర్‌గా వర్క్ చేస్తున్నారుట! మీ నీరజా, అతనూ చిన్నప్పటి నించీ ప్రేమించు కున్నారట. మీ ఆరోగ్యం బాగుపడగానే పెళ్ళి చేసుకుంటామనీ, నన్ను మరచిపొమ్మనీ అంది." విషాదంగా అన్నాడు.

"మా కేమీ మతి పోలేదు గదా? మాకు బావలు, అత్తలు ఉంటే ఈ పాట్లు దేనికి? మా కెవ్వరూ లేరని మీకు తెలుసుగా?"

"మరి. . . నీరజే స్వయంగా రాసి నా చేతి కిచ్చిందే. బహుశా మీకు తెలీదేమో."

"ఏం చెబుతారండీ, బాబూ! నీరజకు, నాకు తెలీకుండా బావేమిటి? అది మిమ్మల్నెందుకో మోసం చేసింది?"

ఇంతలోకి నీరజ ఇంట్లోకి వచ్చింది.

"హల్లో భాస్కర్‌గారూ! ఎంత దయ మా మీద. ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి! బయట కారు చూడగానే పాత వాసన కొట్టింది. స్లిప్పర్స్ చూడగానే అనుమానం తీరిపోయింది." హాయిగా మాట్లాడేస్తున్న నీరజను ఇద్దరూ మార్చిమార్చి చూశారు. అందంగా ముడి వేసుకుని, సిగలో గులాబీ పువ్వు పెట్టుకుని, కళ్ళజోడు పెట్టుకున్న నీరజలో కలిగిన మార్పులను విచిత్రంగా చూస్తున్నాడు భాస్కర్.

"ఏమి టలా కూర్చున్నారు? రవి ఇంకా రాలేదూ?"

"నీరజా! ఇలా కూర్చో." విసురుగా లాగి అడిగింది సరోజ. "నీకు బావెవ్వరున్నారనీ, ప్రేమించి పెళ్ళి చేసుకోబోతా మనీ భాస్కర్‌తో ఎందు కన్నావు?"

తీవ్రంగా ఒక్క క్షణం చూసి, "ఓస్. దీని కోసమేనా మీ బాధంతా. బావ నా ఊహాప్రియుడు. అలా గనక పోతే భాస్కర్ నన్నొదిలే వాడూ కాదు. పెళ్ళి చేసుకునే వాడూ కాదు."

"నీరజా!" ఆవేశంగా అన్నాడు భాస్కర్. "అయితే, నన్నెందుకు మోసం చేశావు? ఎందుకు నా హృదయాన్ని ఆడించావు?"

"సరదాకి. అంతే!" చెంప మీద బలంగా కొట్టింది సరోజ. "ఏం నవ్వునంత బుద్ధి. భాస్కర్‌కు నిజం చెప్పు."

దిగులుగా నవ్వింది నీరజ.

"ఏం చెప్పమంటావు అక్కా. నిజమే. నేను భాస్కర్ని ప్రేమించింది నిజమే. పెళ్ళి చేసుకోవాలని కలలు కందీ నిజమే. కాని, నీకు టి. బి. అని తెలిశాక నేను నా దారి ఎలా చూసుకోను! భాస్కర్. మీకు గుర్తుందా? ఆ రోజు ఎలా ఏడ్చానో? అక్కకు తగ్గుతుందో—లేదో అని ఒకపక్క, రవి భవిష్యత్తు ఒక పక్క. అన్నిట్లోకి భాస్కర్ దిగి చేయూత ఇవ్వగలడు. కాని, నే నంత స్వార్థపరురాల్ని కాలేకపోయ్యాను. భాస్కర్ పెళ్ళయ్యాక అలాగే ఉండలేకపోతే వచ్చే నష్టం ఎవరు భరిస్తారు? భాస్కర్! నువ్వెంత బాధపడి ఉంటావో నాకు తెలిసినట్టే, నే నెంత బాధ పడ్డానో నీకూ తెలీదు. నిన్ను నా దారి నుండి మళ్ళించడానికే నాటకం సృష్టించాను."

"వెల్‌డన్! నా కోసం ఎంత త్యాగం చేశావు!" నీరజను కౌగిలించుకుంది సరోజ.

"కాదక్కా! నీ పట్ల నా కర్తవ్యం నెరవేర్చాను. భాస్కర్ని మోసం చేశాను. నన్ను ద్రోహం చేసుకున్నాను. అంతే!" నిట్టూర్చింది నీరజ.

భాస్కర్ లేచి, "నే నిక్కడికి రాకున్నా బాగుండేది. నువ్వు మీ బావతో సుఖంగా ఉంటావని తలుచుకునే వాణ్ణి. అయితే నీరజా! నువ్వెప్పటికీ పెళ్ళి చేసుకోవా?" అన్నాడు.

"ఊహూఁ. మా బావ కనిపించేంత వరకూ."

"అంటే?"

"అంతే!" నవ్వేసింది.

అక్కడినుండి గబగబా వచ్చి కారు స్టార్ట్ చేశాడు భాస్కర్. *